క్లుప్తంగా

కార్మికుల దినోత్సవాన్ని జయప్రదం చేయండి

పీలేరు : మే 1వతేదీన కార్మికుల దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి డి. యశోద, నియోజకవర్గ కార్యదర్శి నరసింహులు కోరారు. మంగళవారం పీలేరులో ఏర్పాటు చేసిన ఏఐటీయూసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే 1న పీలేరు పట్టణంలో కార్మికులతో ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వెంకటరత్న, నీలావతి, రమణమ్మ, రెడ్డెమ్మ, భారతమ్మ పాల్గొన్నారు.

టపాకాయల గోడౌన్ తనిఖీ

పీలేరు : ప్రభుత్వ నిబంధనలకు లోబడి టపాకాయల దుకాణాలు నిర్వహించాలని తహసీల్దార్ భీమేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం స్థానిక కడప రోడ్డు మార్గంలోని టపాకాయల గోడౌన్‌ను తనిఖీ చేశారు. స్టాకు వివరాలు, దుకాణం భద్రతా ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టపాకయల దుకాణం వద్ద ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ బాలకృష్ణ, లేబర్ ఆఫీసర్ ఆనందబాబు, ఫైర్ స్టేషన్ ఆఫీర్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట పూజలు

పీలేరు రూరల్ : స్థానిక బండ్లవంకలో నూతనంగా నిర్మించిన శ్రీ మాతమ్మతల్లి ఆలయంలో విగ్రహప్రతిష్ట పూజలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం ప్రాతఃకాల పూజలు, అనంతరం చండీహోమం, యంత్రార్చన, ప్రసాదన్యాసం, దాన్యాధివాసం, మహానైవేద్యం, మంగళహారతి, తీర్థప్రసాదాలు వినియోగం చేపట్టారు. సాయంత్రం ప్రదోశకాలపూజ, స్పర్శ హోమములు, శయ్యాధివాసం, మహానివేదిన మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం వేదస్వస్తి నిర్వహించారు. బుధవారం ఉదయం విగ్రహ ప్రతిష్ట నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

పీలేరు రూరల్ : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ యుగంధర్ అన్నారు. మంగళవారం ఉదయం స్థానిక బండ్లవంకలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి అసాంఘిక కార్యక్రమాలపై ఆరా తీశారు. రికార్డులు సక్రమంగా లేని 20 ద్విచక్రవాహనాలు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సారా విక్రయాలు, పేకాట, గంజాయి లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అపరిచిత వ్యక్తులు ఎవరైనా సంచరిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు బాలకృష్ణ, లోకేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ జాతర

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణం బుగ్గకాల్వలోని బోయకొండ గంగమ్మ జాతర మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు దీలు, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తొలిపూజ కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్ పాల్గొన్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, పాడి పంటలు బాగా పండి అందరూ బాగుండాలని అమ్మవారిని మొక్కుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి ఎస్.ఎ.కరీముల్లా, నాయకులు హరి, లక్ష్మీదేవి, యూనస్,మహేష్, మల్లికార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

మదనపల్లె సిటీ : పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని జ్ఞానాంబిక డిగ్రీ కాలేజీ కరస్పాండెంట్ రాటకొండ గురుప్రసాద్ అన్నారు. మంగళవారం కాలేజీలో అంతర్జాతీయ ధరిత్రి దినోత్సవం పురస్కరించుకుని సెమినార్ నిర్వహించారు. 2025 సంవత్సరంలో మన శక్తి మన గ్రహం అనే థీమ్‌ను ప్రకటించారన్నారు. మన సమాజంలో సూక్ష్మ స్థాయిలో అవగాహన వ్యాప్తి చేస్తూనే మన గ్రహాన్ని పర్యావరణ సమస్యల నుండి రక్షించుకునే బాధ్యతను అందరూ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమాదేవి, రమ్య, పాల్గొన్నారు.

తరలిరాద తనే వసంతం



నెల రోజుల క్రితం ఎండిపోయి మోడుబారిన చింతచెట్టు



నేడు పచ్చదనంతో నిండుగా ఉన్న చింతచెట్టు

వసంత రుతువు ఆరంభం కావడంతో ఆకులు రాలిన చెట్లన్నీ కొత్త చిగురిస్తున్నాయి. తరలి రాద తనే వసంతం ..తన దరికి రాని వనాల కోసం.. అంటూ ప్రకృతి ప్రేమికులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. మదనపల్లె మండలం పెంచుపాడు రహదారిలో చింతచెట్టు నెల రోజుల క్రితం ఆకులన్నీ రాలిపోయి మోడుబారి పోయి కనిపించింది. నేడు కొత్త చిగుళ్లతో పచ్చదనం సంతరించుకుంది. చెట్టు నిండా పచ్చని ఆకులతో అందంగా తయారైంది. ఈ మార్గంలో వెళ్లే పాదాచారులు ఎండ తీవ్రతకు కాసేపు ఈ చెట్టు కింద సేద తీరుతూ వెళుతున్నారు. మోడుబారిన చెట్టు పరాజయాలకు సాక్షంగా నిలిస్తే... నిండా పచ్చదనం పరచుకున్న చెట్టు విజయగరాన్ని చాటుతోంది. – మదనపల్లె సిటీ

అర్హులందరికీ పక్కా గృహాలు

ఎమ్మెల్యే షాజహాన్ బాష



అధికారుల సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాష

మదనపల్లె : అర్హులందరికీ ప్రభుత్వ పక్కా గృహాలు మంజూరయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే షాజహాన్ బాష అన్నారు. మంగళవారం హౌసింగ్, మున్సిపల్ రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో సొంత స్థలం కలిగిన అర్హులు 500 మందికి పైగా ప్రభుత్వ పక్క గృహాల మంజూరుకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. వారికి వెంటనే పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని తహసీల్దార్ ధనుంజయలను ఆదేశించారు. బికే పల్లె లేఅవుట్‌లో ఖాళీగా ఉన్న స్థలాలను గుర్తించి అర్హులైన వారికి పక్క గృహాలు మంజూరు చేయాలన్నారు. హౌసింగ్ ప్రక్రియ వేగవంతం చేసి ఇప్పటికే పక్కా గృహాలు మంజూరై నిర్మాణ దశలో ఉన్న ఇళ్లను వెంటనే లబ్ధిదారులు పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలన్నారు. మండలంలోని కోళ్ల బైలు గ్రామంలో తాగునీటి సమస్య ఏర్పడిందని అధికారులు వెంటనే సమస్య పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ రమేష్ కుమార్ రెడ్డి. తహసిల్దార్ ధనుంజయులు, మున్సిపల్ కమిషనర్ కే ప్రమీల, ఎంపీడీవో తాజ్ మస్రూర్, హౌసింగ్ ఏఈ దీన దయాల్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే కార్డెన్ సర్చ్

డీఎస్పీ మహేంద్ర



శివాజీ నగర్‌లో కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

మదనపల్లె : నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పట్టణంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు డీఎస్పీ మహేంద్ర తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున పట్టణంలోని టూ టౌన్ పరిధిలో ఉన్న శివాజీ నగర్, చీకలిగుట్ట, గౌతమి నగర్ విజయనగర్ కాలనీ, తదితర ప్రాంతాల్లో డీఎస్పీ మహేంద్ర ఆధ్వర్యంలో సీఐలు ఎరిషావలి, రామచంద్ర, జీవన్ బాబుతో పాటు, 8 మంది ఎస్‌ఐలు 88 మంది పోలీసు సిబ్బందితో కలసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానిత ప్రదేశాలలో తనిఖీలు చేసి రికార్డులు సరిగ్గా లేని 22 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలు స్వాధీనం చేసుకున్నారు .ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అక్రమ నాటుసారా, మద్యం, గంజాయి, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు సరైన రికార్డులు కలిగి ఉండాలని, ప్రయాణించే సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. విలువైన బంగారు ఆభరణాలు, నగదు ఉంచి బయట ఊర్లకు వెళ్ళరాదని, వాటిని బ్యాంకు లాఖరులో భద్రపరుచుకోవాలన్నారు. మహిళలు ఒంటరిగా వాకింగ్ వెళ్లరాదని, ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

మంచిగా మసులుకోండి

బి.కొత్తకోట : సత్ప్రవర్తనతో మసులుకుని సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలని మదనపల్లె డీఎస్పీ మహేంద్ర రౌడీషీటర్లకు సూచించారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి రౌడీషీటర్ల గురించి ఆరా తీశారు. హాజరైన రౌడీషీటర్ల వివరాలను వారి నుంచే తెలుసుకున్నారు. వారిపై ఏఏ కేసులు ఉన్నాయి, ప్రస్తుతం వాటి స్థితి ఏమిటి, బతకడానికి ఏ పనులు చేస్తున్నారు, ఇంకా ప్రజలను ఇబ్బందులకు గురిచేసే పనులే చేస్తున్నారా అని అడిగారు. శాంతిభద్రల సమస్యను సృష్టించిన వారిపై తక్షణ చర్యలు ఉంటాయన్నారు. అనంతరం సీఐ జీవన్‌గంగనాథ్ బాబుతో కేసులు, పరిష్కారం వివరాలు తెలుసుకుని రికార్డులు పరిశీలించారు.

పీజీఆర్ఎస్ వినతులపై దృష్టి సారించండి



రెవెన్యూ సమస్యలపై విచారిస్తున్న సబ్ కలెక్టరు మేఘస్వరూప్

కలికిరి : ప్రజా పరిష్కార వేదికలో ప్రజల నుంచి వచ్చిన వినతల పరిష్కారంపై దృష్టి సారించాలని ప్రత్యేక దృష్టి సారించాలని మదనపల్లి సబ్ కలెక్టరు మేఘస్వరూప్ అన్నారు. మంగళవారం మధ్యాహ్నం తహసీల్దారు కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు.అనంతరం సిబ్బందితో సమావేశమై రెవెన్యూ సమస్యలపై విచారించారు. ప్రభుత్వ జీఓ నెం.30 మేరకు నివాసాల రెగులరైజేషన్‌లో అర్హులను గుర్తించాలని సూచించారు. మండలంలో జరుగుతున్న రీ సర్వే ప్రోగ్రెస్‌పై విచారించారు. అక్రమాలకు తావులేకుండా రీ సర్వే పూర్తి చేయాలన్నారు. తహసీల్దారు మహేశ్వరీ భాయ్, డీటీ నవీన్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

వీఆర్ఓ సస్పెన్షన్ :

మండలంలోని మేడికుర్తి గ్రామ వీఆర్ఓ శ్రీనివాసులును విధుల నుంచి తాత్కాలికంగా తొలగిస్తూ జిల్లా కలెక్టరు ఉత్తర్వులు జారీ చేశారు. మేడికుర్తి గ్రామ పరిధిలోని బాహుదానదిలో చెక్‌డ్యామ్‌లు, బాహుదా వంతెన, ప్రాజెక్టు కట్ట సమీపంలో ఇసుక తరలిస్తున్నట్లు గ్రామస్తులు సోమవారం పీజీఆర్ఎస్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు వీఆర్‌ఓపై చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. కాగా ఇసుక అక్రమ తరలింపు విషయమై తహసీల్దారుకు జిల్లా కలెక్టరు నుంచి సంజాయిషీ నోటీసు ఇచ్చినట్లు సమాచారం.

రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

గుర్రంకొండ : మండకేంద్రమైన గుర్రంకొండలో ఉచిత కంటివైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించనున్నట్లు రీడో సంస్థ ప్రధాన కార్యదర్శి ఐలా ఈశ్వరయ్య అన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తిరుపతికి చెందిన అరవింద్ కంటి ఆస్పత్రి వారి సౌజన్యంతో స్థానిక తెలుగు జెడ్పీహైస్కూల్లో ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గడ్డి ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడిగా తిప్పన్న

రామసముద్రం : మండలంలోని చెంబకూరు గ్రామ పంచాయతీ కేంద్రంలో మంగళవారం గడ్డి ఉత్పత్తి దారుల సంఘం ఎన్నికలు ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. బలిజపల్లెకు చెందిన బి. తిప్పన్నను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఓ. నాగరాజును డైరెక్టర్లుగా మనోహర్, మోహన్‌రెడ్డి, వెంకటరమణ, నాగరాజు, వెంకటేష్, శివకృష్ణ, కృష్ణమరాజును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నవీన్ చౌదరి, పనికర్ రెడ్డి, రాజేష్ స్వామి, టీకపల్లె రమణ, శ్రీనివాసులు, రంగాని వెంకటేష్, రెడ్డెప్ప, దుర్గా అసిస్టెంట్ రిజిస్ట్రార్ స్వర్ణలత, సీనియర్ ఇన్స్‌పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

పెద్దమండ్యం : జూదం ఆడుతున్న 8 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ పివి రమణ మంగళవారం తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సీ గొల్లపల్లెకు సమీపంలో జూదం నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ప్రత్యేక పోలీసులు దాడులు నిర్వహించారు. దాడుల్లో 8 మంది జూదరులు పట్టుబడగా, వీరి నుంచి రూ.70 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అలాగే 8 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మండలంలో ఎక్కడైనా జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

వృక్ష సంపదను కాపాడుకుందాం

పీలేరురూరల్ : వృక్ష సంపదను కాపాడుకుందామని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నటరాజన్ అన్నారు. మంగళవారం ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని పురష్కరించుకుని విద్యార్థులచే అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన పుడిమితల్లిని రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. పర్యవరణ పరిరక్షణే భవిష్యత్తుకు మూలాదారమని తెలిపారు. ప్రకృతితో మానవ సంబంధాన్ని కాపాడుకోవడం అత్యంత అవసరమన్నారు. మొక్కలు నాటి వృక్ష సంపదను పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణారెడ్డి, జనార్దనరెడ్డి, యర్రయ్య, నాగవేణి, మురళి, శశిదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వాదం



వివాహ రిసెప్షన్‌లో ఆకేపాటి అమరనాథరెడ్డి, నిస్సార్‌అహ్మద్ తదితరులు

మదనపల్లె సిటీ : మదనపల్లె మాజీ ఎమ్మెల్యే గట్టు నరసింగరావు మనవరాలు రెడ్డి నీలిమ, యశ్వంత్ వశిష్ఠల వివాహ రిసెప్షన్ వేడుక మంగళవారం రాత్రి స్థానిక చౌడేశ్వరి కళ్యాణ మండపంలో జరిగింది. కార్యక్రమానికి రాజంపేట ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమరనాథరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్‌లు హాజరయ్యారు. కాబోయే నూతన వధూవరులను ఆశీర్వదించారు.కార్యక్రమంలో టీటీడీ బోర్డు మాజీ సభ్యులు గట్టు సుబ్రమణ్యామం , వెఎస్సార్‌సీపీ నాయకులు మల్లికార్జునరెడ్డి, నూర్ తదితరులు పాల్గొన్నారు.

జీఓ 30 సద్వినియోగం చేసుకోండి

తహసీల్దార్ ఎం. భీమేశ్వర్‌రావు

పీలేరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవో 30ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎం. భీమేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాల్లో అనుమతి లేకుండా 2019 అక్టోబరు 15 కంటే ముందు ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన వారు తమ ఇళ్లను క్రమబద్ధీకరించుకునేందు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మండలంలో సుమారు 5 వేల ఇళ్లు ఉన్నాయని, అయితే ఇప్పటి వరకు 40 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. మిగిలిన వారు సంబంధిత రికార్డులతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఫలితం ఏదైనా ఆందోళన చెందవద్దు

నిస్సార్ అహ్మద్



మదనపల్లె : చదువు జీవితం కాదని, పరీక్ష ఫలితాలపై ఆందోళన చెందవద్దని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్ అన్నారు. బుధవారం పదో తరగతి పరీక్ష ఫలితాలు విడుదల కానునండంతో విద్యార్థులు తక్కువ మార్కులు వచ్చాయని నిరాశపడవద్దని కోరారు. పరీక్ష ఫలితాల నేపథ్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, బంధు,మిత్రులు సమన్వయం పాటించాలన్నారు. పాస్ అయినా ఫెయిల్ అయినా క్షణికావేశానికి గురికావద్దన్నారు. ఉత్తీర్ణులు కాని వారు ఎంతో మంది ఉన్నతంగా ఎదిగారని గుర్తు చేశారు. జీవితం అమూల్యమైనదని ఎలాంటి అఘాయిత్యాలకు పాల్పడవద్దని సూచించారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మదనపల్లె సిటీ : పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఫేస్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి వి.ఎస్.రెడ్డి అన్నారు. మంగళవారం ప్రపంచ ధరిత్రీ దినోత్సవం పురస్కరించుకుని స్థానిక ఎస్‌బిఐ కాలనీలో న్యూ లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. గుడ్డ సంచులు, మొక్కలను పంపిణీ చేశారు. కాలనీలో మొక్కలు నాటారు. భూమిని నాశనం చేస్తే అది జీవజలాన్ని నాశనం చేస్తుందన్నారు. శిలాజ ఇంధనాలైన బొగ్గు, గ్యాస్ నుండి ఉత్పత్తి చేయబడుతున్న విద్యుత్ పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిస్తోందన్నారు. శుద్ధ ఇంధనాల కోసం ప్రభుత్వాలను డిమాండ్ చేయాలన్నారు. పాఠశాల కరస్పాండెంట్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మానవాళి మనుగడకు, పర్యావరణానికి ప్లాస్టిక్ వ్యర్థాలు తీవ్ర హాని చేస్తున్నాయన్నారు. ప్లాస్టిక్ ప్రభావంతో భూమిపై నివసిస్తున్న ప్రాణులన్నింటికి పెను ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖనపోటీల్లో వర్షారెడ్డికి బహుమతి కింద రూ.2 వేలు, రెండవ బహుమతి ఎస్.గౌస్‌అహ్మద్, విజయ్‌కిరణ్‌లకు రూ.1000, మూడవ బహుమతిగా హర్షిత, రోహితలకు రూ.500 నగదును అందజేశారు. కార్యక్రమంలో ఉత్తమేశ్వరరావు, ఆదివిష్ణు, రెడ్డిరాణి, తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

సీకేఆర్‌పల్లె ప్రాథమిక పాఠశాలను విలీనం చేయరాదు



నిరసన తెలుపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

కేవీపల్లె : మండలంలోని నూతనకాల్వ పంచాయతీ సీకేఆర్‌పల్లె ప్రాథమిక పాఠశాలను విలీనం చేయరాదని దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షుడు షేక్ రెడ్డిబాషా కోరారు. మంగళవారం సీకేఆర్‌పల్లె ప్రాథమిక పాఠశాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులతో కలసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1977 నుంచి ఉన్న పాఠశాలను నేడు మోడల్ ప్రైవరీ పేరుతో విలీనం చేయరాదన్నారు. పలు గ్రామాల విద్యార్థులకు ఈ పాఠశాల అనువుగా ఉందని తెలిపారు. ఈ విషయమై ఎంఈవో రెడ్డిబాషాను వివరణ కోరగా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా, పేరెంట్స్ కమిటీ ఆమోదంతో 3 వ తరగతి నుంచి 5వ తరగతి వరకు మోడల్ ప్రైమరీకి మార్చడానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. 1, 2 తరగతులు అక్కడే ఉంటాయి చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఖాదర్‌వల్లి, అబ్దుల్ గనీఫ్, నౌజియా, సయ్యద్‌బాషా, పద్మావతి, నాగలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

మదనపల్లె సిటీ : స్మార్టు మీటర్లు రద్దు చేసి, విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ మంగళవారం సీపీఎం పార్టీ కార్యాలయంలో కరపత్రాలు ఆవిష్కరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా తగ్గించకపోగా ఈ కాలంలో 15,450 కోట్లు భారం మోపారన్నారు. పాదయాత్రలో మంత్రి లోకేష్ స్మార్ట్ మీటర్లు పగలగొట్టమని చెప్పారని, అధికారంలోకి వచ్చిన తరువాత స్మార్ట్ మీటర్లు వ్యవసాయానికి, గృహాలకు బిగించడం దుర్మార్గమన్నారు. ఎక్కువ మంది ఏ సమయంలో విద్యుత్ వాడుకుంటారో ఆ సమయంలో యూనిట్ ధరలు పెంచి, టైమ్ ఆఫ్ డే విధానాన్ని కూటమి ప్రభుత్వం తీసుకురావడం సిగ్గుచేటన్నారు. టైమ్ ఆఫ్ డే విధానం రద్దు చేయాలని, విద్యుత్‌భారాలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

రైతులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి

- అటవీశాఖ అధికారుల తప్పిదాలకు రైతులను బలిచేస్తారా?
- సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

మదనపల్లె సిటీ : చిరుతపులి మృతి చెందిన సంఘటనలో రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పిఎల్ నరసింహులు డిమాండ్ చేశారు. మంగళవారం మదనపల్లె మండలం పొన్నూటిపాలెం గ్రామంలోని సంఘటన స్థలం,స్థానికులతో విచారణ చేశారు. అటవీశాఖ అధికారుల తప్పిదాలను కప్పిపుచ్చుకోవడం కోసం అమాయకులైన రైతులను అరెస్టు చేసి జైల్లో పెట్టడం అన్యాయమన్నారు. అధికారుల నిర్లక్ష్యం, చేతకాని తనం వల్ల చిరుత ప్రాణాలు కోల్పోవడం జరిగిందన్నారు. గంగాధర్ కుటుంబ పోషణ కోసం నెల క్రితం భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తుంటే ఆ భూమి పక్కనే ఫారెస్టులో చిరుత వలలో చిక్కుకుందని, దీంతో అతనిపై కేసు నమోదు చేయడం అన్యాయమన్నారు. ప్రభుత్వం స్పందించకి ఉన్నత స్థాయి ఐఎఎస్ అధికారి చేత విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. చిరుత ప్రాణాలు కాపాడలేని అటవీశాఖ అధికారులను సస్పెండ్ చేసి, రైతులపై పెట్టిన కేసులు తొలగించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కె.మురళి,దేవా, తిరుమల పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



బి.కొత్తకోట: అవగాహన కల్పిస్తున్న భాగ్యమ్మ



పీలేరులో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు



కురబలకోట : పోషకాహార పదార్థాల ప్రదర్శన

బి.కొత్తకోట : పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలు, పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ కే.భాగ్యమ్మ తెలిపారు. మంగళవారం మండలంలోని గట్టు, కాండ్లమడుగు అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పౌష్టికాహార కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేస్తున్నామన్నారు. గర్భిణులు, బాలింతలు, పౌష్టికాహార లోపం కలిగిన పిల్లలకు బలవర్ధక ఆహారం అందించడం జరుగుతుందని చెప్పారు. అంగన్‌వాడీ సిబ్బంది వీరిపై నిత్యం పర్యవేక్షణ చేయాలని కోరారు. కార్యక్రమాల్లో సూపర్‌వైజర్ జి.జయరాణి, ఏఎన్ఎం మాలతి, పిల్లల తల్లులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన పోషకాహార పక్షోత్సవాలు

పీలేరు : ఈ నెల 8 నుంచి నిర్వహించిన పోషకాహార పక్షోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. చివరి రోజు పీలేరు ఐసీడీఎస్ కార్యాలయం నుంచి నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో రాజమ్మ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు వంద రోజుల పౌష్టికాహారంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అంగన్‌వాడీల పరిధిలో గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ పిల్లల నమోదు సక్రమంగా నిర్వహించాలన్నారు. చిరుధాన్యాల వల్ల కలిగే ప్రయోజనాలు, ప్రభుత్వం సరఫరా చేసే పౌష్టికాహారంతో కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. కార్యక్రమంలో పీలేరు, కేవీపల్లె, కలకడ మండలాల సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అందరికీ ఆరోగ్యం అవసరమే

కురబలకోట : ఆరోగ్యమన్నది ప్రతి ఒక్కరికీ అవసరమని ఎంపీడీఓ గంగయ్య అన్నారు. మండల స్థాయిలో పోషణ్ పక్వాడా కార్యక్రమం స్థానిక మండల పరిషత్ మీటింగ్‌హాల్‌లో మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమతుల ఆహారం (పోషక ఆహారం) తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రతి తల్లి ఆరోగ్య విషయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. తగినంత నిద్ర, వ్యాయాయం కూడా అవసరమన్నారు. వైద్యాధికారి శ్రీధర్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్వేత, కళావతి, వెలుగు ఏపీఎం శ్రీనివాసులుతో పాటు అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



